ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

లాలాపేట: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ ఎం. థామస్‌రెడ్డి తదితరులు ప్రొ. కోదండరామ్‌కు వినతిపత్రం సమర్పించారు. బుధవారం తార్నాకలోని ఎమ్మెల్సీ నివాసంలో కలిసారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రం ఆయనకు అందజేశారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో బుధవారం వరల్డ్ కిడ్నీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అపోలో డయాలసిస్ క్లినిక్స్ అధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కిడ్నీ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా కిడ్నీలు పాడవకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అపోలో డయాలసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యపరిరక్షణ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున అపోలో వైద్య సిబ్బంది, స్థానికులు అనేక మంది పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కంది శైలజ పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు బస్తీలలో వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని స్థానికుల నుండి అందిన ఫిర్యాదుల మేరకు బస్తీల్లో పర్యటించినట్లు కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వెంటనే పాడైపోయిన లైట్లకు తగిన మరమ్మతులు చేయాలని, అదే విధంగా అవసరమున్న ప్రాంతాల్లో నూతన స్ట్రీట్ లైట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లండి




సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: డివిజన్‌లో నాయకులందరూ కలిసికట్టుగా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బిజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ సూచించారు. బుధవారం అడ్డగుట్టలో డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. భరత్‌గౌడ్ మాట్లాడుతూ స్థానికంగా నెలకొని ఉన్న ప్రజా సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణ, నర్సింగ్‌రావు, రాజారామ్, హంసరాజు, ఉదయ్ యాదవ్ పాల్గొన్నారు.

'హెల్ప్' తీసుకోండి

- సర్కిల్ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్‌లు
- దరఖాస్తు దారులకు ఫోన్లు
- వారం రోజుల్లో ధృవీకరణల జారీకి ఏర్పాట్లు
- జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో ఎల్ఆర్ఎస్ సందడి





జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఆర్ఎస్ హెల్ప్‌డెస్క్

సికింద్రాబాద్: అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసుకున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు తాజాగా జీహెచ్ఎంసీ అధికారులు పరిష్కారం చూపుతున్నారు. జీహెచ్ఎంసీ ఉత్తరమండలం కార్యాలయం నుంచి వారం రోజుల క్రితం సర్కిల్ కార్యాలయాలకు సిటీ ప్లానింగ్ విభాగం అధికారులు బదిలీ చేశారు.
- దరఖాస్తు దారుల సందేహాలు నివృత్తి చేయడం, సమస్యలు పరిష్కరించడంతోపాటు వారి నుంచి ఫీజు రాబట్టేందుకు జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఫీజు చెల్లించిన దరఖాస్తు దారులకు వారం రోజుల్లోగా ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్లు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసకుంటున్నారు.

ఈనెల 31 వరకు రాయితీ....

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు పలు పరిశీలనల అనంతరం ఆమోదం లభించిన దరఖాస్తు దారులు ఈనెల 31 లోపు ఫీజు చెల్లించుకునేందుకు మున్సిపల్ అధికారులు అవకాశం ఇచ్చారు. నిర్ణీత తేదీలోపు ఫీజు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ఇస్తున్నారు. ఈ సమాచారాన్ని ఆమోదం పొందిన దరఖాస్తు దారులకు నేరుగా ఫోన్ చేస్తూ సమాచారం అందిస్తున్నారు.
◆ ప్రభుత్వ యాప్‌ల ద్వారా ఫీజు చెల్లించే పద్ధతులను వివరిస్తున్నారు. సమస్యలు, సందేహాలు ఉంటే నేరుగా జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్దకు రావాలని ఆహ్వానిస్తున్నారు. రాయితీ ప్రకటించిన నేపథ్యంలో పలువురు దరఖాస్తు దారులు ఫీజు చెల్లింపుకు ముందుకు వస్తున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం

తమకు అందిన దరఖాస్తులు ఆమోదించడంలో జోనల్ సిటీప్లానింగ్ విభాగం అధికారులు పలు కసరత్తులు చేసిన మీదట ఆమోదం తెలుపుతున్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ, వివాదాస్ప భూముల గురించి సమగ్రంగా పరిశీలన జరిపిన మీదట ఆమోదం తెలుపుతున్నారు.
◆ ఇందు కోసం రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారం తీసుకుంటున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది నెలలకు పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ దరఖాస్తులు క్లియర్ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు జారీ చేసినప్పటికీ వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల మధ్య సయోధ్య కుదరకపోవడం, కొందరు దరఖాస్తు దారులు ఆసక్తి చూపకపోవడం ఫలితంగా జాప్యం జరిగింది.

4వేల మందికి సమాచారం

జీహెచ్ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తంగా 4,795 మంది దరఖాస్తులను ఎల్ఆర్ఎస్ కోసం ఆమోదించారు. వీరందరికీ ఎల్ఆర్ఎస్ ఫీజు ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలంటూ ఫోన్ కాల్ ద్వారా, మెస్సేజ్ ద్వారా సమాచారం అందిస్తున్నారు.
◆ జోనల్ పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల్లో ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో అత్యల్ప దరఖాస్తులు 165, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అత్యధికం 3,395 దరఖాస్తులను ఆమోదించిన అధికారులు ఫీజు చెల్లించాలని కోరుతున్నారు. సరైన ధృవీకరణలు దరఖాస్తుతో జత పరుచకపోవడం, భూసమస్యలు, వివాదాల కారణంతో మరో 149 వరకు దరఖాస్తులను జీహెచ్ఎంసీ అధికారులు పెండింగ్‌లో ఉంచారు.

సర్కిల్	ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు
సికింద్రాబాద్	531
అంబర్‌పేట్	339
ముషీరాబాద్	165
బేగంపేట్	365
మల్కాజిగిరి	3395
మొత్తం	4795

విద్యారంగ సమస్యల పరిష్కారానికి అసెంబ్లీ ముట్టడి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. బుధవారం ఓయూ నుంచి బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు నాగరాం ప్రశాంత్ ఆధ్వర్యంలో పది మంది విద్యార్థులు అసెంబ్లీ వద్దకు చేరుకొని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి షా ఇనాయత్ గంజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు పెద్దమ్మ రమేష్‌ముదిరాజ్, శశిపాల్, మేకల రవి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై అధికారుల దృష్టి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ మోతీలాల్‌నెహ్రూనగర్‌లో రోడ్డు పక్కన ఆక్రమణలపై అధికారులు దృష్టిసారించారు. ఇక్కడి ఆక్రమణలపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని స్థానికులు పలువురు కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఈ విషయాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియజేశారు. బుధవారం డిప్యూటీ సిటీ ప్లానర్ (డీసీపీ) సుష్మిత సిబ్బందితో కలిసి ఆ కాలనీలో పర్యటించారు. రోడ్లన్నీ పరిశీలించిన మీదట వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్న కొన్ని ఆక్రమణలను గుర్తించారు. గురువారం వాటిని తొలగించనున్నట్లు చెప్పారు. టౌన్‌ప్లానింగ్ డీసీపీతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం, నాయకులు చిరంజీవి, కృష్ణ, గోపి, సురేష్ తదితరులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్‌లోని సుప్రసిద్ధమైన శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం వేదపండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఆలయ సంప్రోక్షణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు సంప్రదాయ బద్ధంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మోండా మార్కెట్ డివిజన్ బండిమేట్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయం వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు, మహేందర్ పాల్గొన్నారు.

భానుక నర్మదకు పలువురి అభినందనలు



ఎంపీ ఈటల, భానుక నర్మదలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యురాలిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన భానుక నర్మదకు అభినందనలు వెల్లువెత్తాయి. బోయిన్‌పల్లి నుంచి భారీ ర్యాలీతో బోర్డుకు చేరుకున్న భానుక నర్మదకు బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఓపన్ టాప్ జీపులో వచ్చిన భానుక నర్మదతో పాటు ఎంపీ ఈటల రాజేందర్‌ను గజమాలతో సత్కరించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, మోండా కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల బకాయిలు చెల్లించాలి



డీఆర్ఎం కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

అడ్డగుట్ట: రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన భవన్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని హైదరాబాద్ రైల్వే స్టేషన్ లో రక్షక్ సెక్యూరిటీస్ సంస్థ కింద పనిచేసిన సుమారు 50 మంది కాంట్రాక్టు కార్మికులకు 4 నెలల జీతాలు, రెండు సంవత్సరాల బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ జీతాలు, బోనస్ ఇవ్వకపోతే రైల్వే యాజమాన్యం కార్మికులకు ఇవ్వాలని 2024 అక్టోబర్ 7న రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) పేర్కొన్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పటివరకు కూడా కాంట్రాక్టర్ కానీ రైల్వే యాజమాన్యం కానీ బకాయిలను చెల్లించలేదన్నారు. జీతాల కోసం అడిగిన ప్రతీసారి వాయిదాలు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ధర్నాలో సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం మీదే



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బన్సీలాల్‌పేట్: ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ఎంతో సులువని వక్తలు సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10 తరగతి విద్యార్థులకు 'భయం వీడితే జయం మనదే' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయులు స్వప్నమాల, కె. నారాయణరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, ఎయిర్ ఫోర్స్ మాజీ ఉద్యోగి రాజా నరసింహ్మారావు, రెయిన్‌బో ప్రొగ్రామ్ డైరెక్టర్ శ్రీలత తదితరులు మాట్లాడారు. పిల్లలకు పరీక్షలంటే భయం ఎందుకు ..మానసిక ఒత్తిడిని ఎలా జయించాలి....చదివింది మరచిపోకుండా ఎలా గుర్తు పెట్టుకోవాలి...అనే టెక్నిక్స్‌ను సైకాలజిస్ట్ డాక్టర్ జ్యోతి రాజా వివరించారు. మనసులో ఉన్న భయాన్ని తొలగించి... ప్రశాంత వాతావరణంలో ప్రణాళిక బద్ధంగా చదివి విద్యార్థులు పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్, బోయిగూడ, ఆదయ్యనగర్ తదితర ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 10వ తరగతి చదువుతున్న సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు.

ఆలయంలో చోరీకి యత్నం



నిందితుడు కుత్బుద్దీన్

చిలకలగూడ : మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆలయంలో చోరీకి యత్నించాడు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన మేరకు.. ముషీరాబాద్ బోలక్‌పూర్‌కు చెందిన కుత్బుద్దీన్ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తుంటాడు. మద్యం, గంజాయికి అలవాటు పడ్డాడు. ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతుంటాడు. బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో పద్మారావునగర్ సాయిబాబా ఆలయ ప్రాంతంలో సంచరించాడు. అదేప్రాంతంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ తలుపులు తెరిచిఉన్నాయి. ఆలయంలోకి వెళ్లి హారతిపళ్లెం, శఠగోపం, గంట తదితర ఇత్తడి సామగ్రిని తీసుకెళ్లబోయాడు. స్థానికులు గమనించి దేహశుద్ధి చేసి చిలకలగూడ పోలీసులకు అప్పగించారు.

చెత్త ఇలా.. స్వచ్ఛ ర్యాంక్ ఎలా?



సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం, హిందూ పబ్లిక్ స్కూల్ మధ్య చెత్తా చెదారం..



శ్యాంలాల్ బిల్డింగ్స్ నుంచి ఇందిరాగాంధీపురం వెళ్లే రహదారిలో..

సనత్‌నగర్: స్వచ్ఛతలో ర్యాంక్ కోసం దేశంలోని నగరాలు పోటీపడుతుంటాయి. అందుకోసం వివిధ రకాలుగా పౌరులకు అవగాహన కల్పిస్తూ స్వచ్ఛతా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తుంటారు. మరికొద్ది రోజుల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ నగరంలో పర్యటించనుంది. హైదరాబాద్‌కు స్వచ్ఛతా ర్యాంక్ సాధించేందుకు ఉన్నతాధికారులు కూడా ఇప్పటికే ఆయా సర్కిళ్ల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే దగ్గర పడుతున్న దృష్ట్యా రోడ్లపై చెత్తా చెదారం పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. ఖైరతాబాద్ సర్కిల్-17 పరిధిలోని సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం, హిందూ పబ్లిక్ స్కూల్ మధ్య ఉన్న రోడ్డు పొడవునా చెత్త పేరుకుపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారికి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ముఖ్యంగా పక్కనే రెండు స్కూళ్లతో పాటు దేవాలయాలు కూడా ఉండటంతో ఆయా చోట్లకు వచ్చే ప్రజలు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై చెత్తను డంప్ చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. జరిమానాల రూపంలో కొరఢా ఝళిపిస్తున్నా రోడ్లపై చెత్త వేయడం మాత్రం మానడం లేదు. అధికారులు రోడ్లపై చెత్త వేయడాన్ని నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసికున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బుధవారం మోండా మార్కెట్ డైమండ్ హౌస్ ప్రాంతంలోని ఓ షాపు ముందు గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడివున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని చనిపోయినట్లు తెలిపారు. మృతుడికి 40 నుంచి 45 ఏళ్ల వయసుంటుందని తెలిపారు.

'పది'కి పకడ్బందీగా..

- పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఈ నెల 21 నుంచి పరీక్షలు..



సనత్‌నగర్ అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల భవనంలోని పరీక్షా కేంద్రం..

సనత్‌నగర్: ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్షా సెంటర్లను ఎంపిక చేసి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఒకటికి పది సార్లు పరిశీలించి పరీక్షా కేంద్రాల అన్ని వసతులను కల్పించే పనిలో పడ్డారు. వేసవి నేపథ్యంలో ఎండల తీవ్రత కూడా బాగా ఉండడంతో పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా సెంటర్లలో ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం కల్పిస్తున్నారు. ముఖ్యంగా గాలి, వెలుతురు బాగా ఉండేలా చూస్తున్నారు. అలాగే పరీక్షలు దగ్గరకు వచ్చే కొద్దీ విద్యార్థులు పుస్తకాలను వీడటం లేదు. మొట్టమొదటి సారి పబ్లిక్‌పరీక్షలను రాయబోతున్న విద్యార్థుల ఆందోళనను పోగొట్టేందుకు ఉపాధ్యాయులు చర్యలుతీసుకుంటున్నారు. పలు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.

సికింద్రాబాద్ మండలంలో 13 సెంటర్లు.. 3,870 మంది విద్యార్థులు..

సికింద్రాబాద్ మండల పరిధిలో 13 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. మండల పరిధిలో 500 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఎయిడెడ్ 720 మంది, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1700, సంక్షేమ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు 950 మంది పరీక్షలు రాస్తున్నారు. మొత్తం 3,870 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఒక్కో సెంటర్‌లో 220 నుంచి 240 మంది వరకు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్కో కేంద్రానికి ఒకరు చొప్పున 13 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 13 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్, పోలీస్ కస్టోడియన్లను నియమించారు. ఒక్కో కేంద్రానికి 14 మంది చొప్పున మొత్తం 182 మంది ఇన్విజిలేటర్లను నియమించి ఇప్పటికే ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని కూడా పూర్తి చేశారు.

అమీర్‌పేట మండలంలో 10 సెంటర్లు.. 1970 మంది విద్యార్థులు...

అమీర్‌పేట మండలంలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 140 మంది విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1830 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.
◆ బాలానగర్ మండల పరిధి కిందికి వచ్చే అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల (సనత్‌నగర్ ఓల్డ్) పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

ఎలాంటి ఆందోళన వద్దు

ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఆ మేరకు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ముఖ్యంగా భయాన్ని వీడేలా చూడాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధన దిశగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వచ్చాం. సబ్జెక్టుపరంగా ఎలాంటి సందేహాలు ఉన్నా ప్రత్యేక తరగతుల ద్వారా నివృత్తి చేసుకుంటూ వచ్చారు. ఏడదంతా కష్టపడి చదవిన విద్యార్థులు ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలి.

– శ్రీధర్, జిల్లా ఉప విద్యాధికారి, సికింద్రాబాద్

కేసులు ఉపసంహరించుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ దివ్యాంగ విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని టీజీవీపీ రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు. గత వారం ఓయూ వీసీ ఛాంబర్‌లో మెస్ బిల్లులు రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థుల పై వివిధ సెక్షన్ల కింద అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ పీఎస్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంతో కష్టపడుతూ పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులపై పోలీసు కేసులు బనాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా అయితే వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. కేసులను వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపట్టనున్నట్లు శ్రీశైలం యాదవ్ హెచ్చరించారు.

HIGH COURT FOR THE STATE OF TELANGANA AT HYDERABAD
I.A. No. 1 of 2025
IN
W.P.No. 29625 of 2024
Mohd. Sameeuddin,
S/o. Mohd. Zahiruddin ..Petitioner
AND
The State of Telangana. Rep. by its Principal Secretary Home Department Hyderabad & others ..Respondents
NOTICE
To,
S. Prasad, S/o. Lingaiagh Aged about 55 years, Occ: Secretary to St. Mark Educational Society, R/o. Flat No. 112, Siddartha Madhuvan Apartments Zamia Islamia, Secunderabad - 500361.
Please take notice in the above case filed by my client Mohd. Sameeuddin, S/o. Mohd. Zahiruddin before the Hon'ble High Court questioning the action of the respondent No.2 to 5 in Writ Petition in not taking any action & the representation dated 05.10.2024 & not providing the police protection to the petitioner and his land in Sy.No.1429 admeasuring extent of 4840 sq.yds. situated at Khalsa, Ibrahimpatnam, Ranga Reddy District. The Hon'ble High Court permitted to take notice on you by way of paper publication in IA No.1 of 2025 in WP No.29625 of 2024 dated 17.02.2025, intimating the date of hearing of the above case to you in publishing local edition daily news paper & posted the above case to on 17.03.2025. therefore take notice in the above case appear in person or through counsel before the Hon'ble High Court on or before 17.03.2025 otherwise the court will pass orders record available.
BY ORDER OF THE HON'BLE HIGH COURT FOR THE STATE OF TELANGANA
CH. JANARDHAN REDDY ADVOCATE
Cell: 9948154030

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379